## కథ

సాయంత్రం నాలుగు దాటుతోంది.

యాభై ఏళ్ళ అన్నపూర్ణమ్మ కారిడార్‌లో కూర్చుని బయటికి చూస్తోంది. నాలుగు రోజుల క్రితం బాత్‌రూమ్‌లో కాలు స్లిప్ అయి బెణికింది. వాపు, నొప్పి తగ్గాయిగాని గోడలు పట్టుకొని నడుస్తోంది.

# ప్రేమ ఎంత గొప్పది?



ఆడపిల్లలిద్దరూ పెళ్ళిళ్ళు అయి అత్తారిళ్ళకి వెళ్ళారు. ఒక్క కొడుకు కెనడాలో ఉంటాడు. భర్తది బిజినెస్. ఇంట్లోకంటే బయటే ఎక్కువుంటాడు.

చల్లగాలికి బాల్కనీలో కూర్చుని కాలక్షేపంగా రోడ్డుమీద వచ్చిపోయే వార్ని చూస్తోంది అన్నపూర్ణమ్మ.

హఠాత్తుగా తమ ఇంటి పక్కనే వున్న ఖాళీ స్థలం మీద పడింది ఆవిడ దృష్టి.

అక్కడ కనిపించిన దృశ్యం ఆమెని ఆందోళనకి గురిచేసింది.

రెండు పెద్ద గోరొంకలు అదే పనిగా గోలగోలగా అరుస్తూ చెట్టుమీంచి కిందికి పైకి ఎగురుతున్నాయి.

వాటి అరుపుకి అన్నపూర్ణమ్మ దృష్టి అటుపడింది.


ఏమిటా అని కారిడార్ చివరికి వచ్చి పక్కనున్న ఖాళీ స్థలంలోకి చూసింది.

గోరువంకల తాలూకా రెండు పిల్లలు కొమ్మల మీంచి కిందికి ఎగిరాయి. కాని కిందినుంచి పైకి ఎగర లేకపోతున్నాయి. వాటికి ఇంకా రెక్కలు పూర్తిగా రాలేదు.

తల్లితండ్రి పక్షులు కూనలు కిందపడిపోవటం గుండె చెదిరినట్లు గోలగా అరుస్తున్నాయి.

ఆ దృశ్యం చూసిన అన్నపూర్ణమ్మ తల్లి మనసు అల్లాడిపోయింది. బిడ్డలు ముగ్గురూ దూరంగా వెళ్ళాక ఆమె అలాంటివి ఏమీ తట్టుకోలేదు.

ఆ రెక్కలు రాని కూనల పరిస్థితి ఆమెని ఆందోళనకి



కాకాని కమల

గురిచేసింది.

అది చాలా పెద్ద ఖాళీస్థలం. చుట్టూరా కాంపౌండు వాలు. గేటు. దానికి తాళం. పోలీస్ అకాడమీ కాలనీ కట్టుకుందుకు కొన్న స్థలం అది.

ఎప్పుడు కడతారో తెలియదు. తుప్పల్లా చెట్లు ముళ్ళు డొంకలు గడ్డి పెరిగిపోయాయి. అందరూ గోడమీంచి ఆ స్థలంలో చెత్తప్యాకెట్లు వేస్తారు. ప్లాసిక్ కవర్లు, విరిగిన ప్లాస్టిక్ బకెట్లు గాజుముక్కలు ఏరుకునే వాళ్ళందరూ గేటు దాటి అందులో చేరతారు. గేటు సందుల్లోంచి కుక్కలు చెత్తకోసం చేరతాయి. గడ్డిలో ఆ కిందపడ్డ పక్షి కూనల్ని చూస్తూ కుక్కలు వదులుతాయా?

అన్నపూర్ణమ్మ మనసంతా ఆందోళన నిండిపోయింది. పసితనంలో తన పిల్లలు జ్ఞాపకం వచ్చారు.

ఆ కూనల్ని ఎలాగైనా రక్షించాలి.

అన్నపూర్ణమ్మ జాలిగుండె ఆందోళన పడింది.

కానీ ఆమెకి అసాధ్యం. కాలు బెణికి ఇంట్లోనే సరిగా తిరగలేకపోతూంది. తన కాంపౌండ్ వాల్ పక్కనే ఖాళీ స్థలం. కానీ ఆ కాపౌండు వాల్ని తను ఎలా దూకగలదు?

అన్నపూర్ణమ్మ ప్రాణం కొట్టుకుంటోంది.

ఆ రెండు పెద్ద పక్షులు గోలగా అరుస్తూనే ఉన్నాయి.

వాకింగ్ స్టిక్ ఊతగా మెట్లు దిగి ఇంటి గేట్ దగ్గరికి వచ్చింది కుంటుకుంటూ.

తెలుసున్న వాళ్ళు ఎవరన్నా కనిపిస్తారేమోనని గేటు ముందు నిల్చుని అటు ఇటు దృష్టి సారించింది.

ఆవిడకి ప్రాణం వచ్చినట్టు అయింది.

పక్కింటి పధ్నాలుగేళ్ళ అజయ్ పుస్తకాల బ్యాగు భుజాన వేసుకుని ట్యూషన్‌కి వెడుతున్నాడు.

"నాయనా అజయ్..ఒక్కసారి ఇటురా. చిన్న పని వుంది" అంది.

"ఏంటి ఆంటీ..కాలునొప్పి ఇంకా తగ్గలేదా?" అన్నాడు.

"లేదురా తండ్రి. ఒక్కసారి నాతో లోపలికి రా" అంటూ వాడి భుజం మీద చెయ్యి వేసి తిరిగి బాల్కనీ కారిడార్‌లోకి వచ్చింది.

గోడ అతవల ఇంకా ఆ పెద్ద పక్షులు గోలగా అరుస్తూ ఎగురుతూనే వున్నాయి.

నేలమీద గడ్డిలో పడ్డ రెక్కలు సరిగ్గా రాని వాటి కూనలు అలాగే నిస్సహాయంగా పైకి ఎగరలేక పడి వున్నాయి.

"ఒరేయ్ అజయ్..మన పెరట్లో చిన్న నిచ్చెన వుంది. తీసుకురా నాన్నా" అంది.

పుస్తకాల బ్యాగు కింద పెట్టి ఇంటి వెనక్కి వెళ్ళి చిన్న నిచ్చెన తెచ్చాడు.

"అది వేసుకుని ఆ గోడ ఎక్కు" అంది.

అజయ్ పిట్టగోడ ఎక్కాడు. "అదిగో ఆ రెండు గోరింక పిట్టలు పాపం చెట్టు మీదికి ఎగరలేకపోతున్నాయిరా. ఈ నిచ్చెన అటువైపు వేసుకొని ఆ రెండింటిని గుబురుగా వున్న ఆ చెట్టుకొమ్మల మీదికి చేర్చరా అజయ్. ఏ కుక్కలన్నా చూస్తే తినేస్తాయి పాపం" అంది.

అజయ్ ఉత్సాహంగా "సరే ఆంటీ" అంటూ పిట్టగోడ మీంచి నిచ్చెన లాగి అటుపక్కకి వేసి ఆ పిట్టల్ని జాగ్రత్తగా అక్కడే గుబురుగా వున్న చెట్లకొమ్మల మధ్య ఇరుక్కునేలా పెట్టాడు.

అజయ్ తమ కూనల్ని పట్టుకుంటుంటే పెద్ద పిట్టల గోల మరింత ఎక్కువైంది.

అప్పటికే దూరంగా వున్న గేటులోంచి దూరిన కుక్కలు అటుగా వస్తున్నాయి.

అజయ్ ఆ రెండు చిన్నపిట్టల్ని ఎత్తుగా వున్న గుబురుకొమ్మల మధ్య పెట్టాడు. చెట్టుకి నిచ్చెన వేసుకుని పైకొమ్మల మధ్య వాటిని ఇరికించినట్లు పెట్టాడు.

పెద్దపిట్టల గోల అణిగింది.

"చాలా ఆంటీ?" అన్నాడు.

"చాలురా అజయ్. చక్కగా పెట్టావ్. ఇంక వచ్చెయ్" అంది.

తిరిగి నిచ్చెన పిట్టగోడకి ఆన్చి గోడపైకి ఎక్కి నిచ్చెన లాగి ఇటు వేసి దిగాడు.

నిచ్చెన పెరట్లో పెట్టటానికి వెళ్ళాడు.


అన్నపూర్ణమ్మ కర్ర ఊతతో నడుస్తూ వంటగదిలోకి వచ్చి ఫ్రిజ్‌లో రెండు ఆపిల్సుంటే తీసి మళ్ళీ కారిడార్‌లోకి వచ్చింది.

అప్పటికే అజయ్ భుజాన సంచి తగిలించుకుని "నే ట్యూషన్‌కి వెళుతున్నా ఆంటీ" అన్నాడు.

"వుండు నాన్నా అజయ్..చాలా థాంక్స్‌రా. దేవుడిలా వచ్చి వాటిని రక్షించావు. ఇదిగో ఈ రెండు పళ్ళు తిను" అంది.

## ఆర్తీకి మంచి చాన్స్!

**ఆమధ్య ఆత్మహత్యా యత్నంతో వార్తలకెక్కిన ఆర్తీ అగర్వాల్‌కి ఇప్పుడు తెలుగులో అవకాశాలు అంతగా లేవు. దాంతో ఆమె తన దృష్టిని తమిళ రంగం వైపు మళ్లించిందని తాజా సమాచారం. అదలా వుంచితే- తెలుగులో ఆమెకి ఇప్పుడో మంచి అవకాశం వచ్చింది. కెమెరామాన్‌గా ఎంతో ప్రసిద్ధదయిన వి.ఎస్.ఆర్.స్వామి తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో ఆర్తీని కథానాయికగా ఎన్నుకోనున్నట్టు చెబుతున్నారు. అనుభవం, అభిరుచి వున్న వి.ఎస్.ఆర్.స్వామి తీసే చిత్రంలో చాన్స్ లభించడం అంటే కెరీర్‌కి ప్లస్సే మరి.**



"వద్దు ఆంటీ.." మొహమాట పడ్డాడు.

"తప్పు. పెద్దవాళ్ళు ఇస్తుంటే కాదనకూడదు.." అంది ప్రేమగా మందలిస్తున్నట్లు.

మొహమాటంగా పళ్ళు తీసుకుని సంచీలో పెట్టుకున్నాడు.

"కాస్త గేటువేసి వెళ్ళు నాయనా" అంది.

"సరే ఆంటీ" అంటూ వెళ్ళిపోయాడు.

అజయ్ గేటు దాటగానే సంచిలోంచి పండుతీసి కొరుకుతూ వెళ్ళటం అన్నపూర్ణకు నవ్వు తెప్పించింది.

పక్క ఖాళీ స్థలంలోకి చూసిన అన్నపూర్ణమ్మ ప్రాణం లేచి వచ్చినట్లు అయింది.

అంతవరకు గోలగా అరుస్తూ గాలిలో గింగిరాలు తిరిగిన పెద్ద పక్షులు చెట్టు గుబురులో వున్న పిల్లల్ని చేరాయి. పెద్ద పక్షులు పక్షికూనలు ముక్కుల్తో పలకరించుకుంటూ తిరిగి ఆనందంగా అరుస్తున్నాయి. పక్షి అయినా జంతువైనా మనిషి అయినా సృష్టిలో తల్లీపిల్లల ప్రేమ ఒకటే కదా?